# నిజాయితీ

ఎవరికైనా మాట ఇచ్చి తప్పు. తాను కాని ఏడుకొండల వాడికి కాదు. వెళ్ళితీరాలి." చెప్పాడు విశ్వేశ్వరరావు తన కొడుక్కి.

విశ్వేశ్వరరావు తన ఇద్దరు కొరుకులు, భార్య, పెద్దకోడలితో హైదరాబాద్ నించి తిరుపతికి వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్‌లో వెళ్ళాడు తన రెండో కొడుకు సి.ఎ. ఫైనల్ పరీక్ష పాసయితే అంతా వచ్చి తల నీలాలు సమర్పిస్తామని వెంకటేశ్వరస్వామికి మొక్కుకున్నాడాయన.

ఇల్లు తాళం పెట్టి వెళ్ళారు. ఆడ, మగ బేధం లేకుండా అంతా గుండు చేయించుకున్నారు. ఆ కుటుంబంలో విశ్వేశ్వరరావు గీచిన గీత దాటే ధైర్యం ఎవరికీ లేదు.

తిరుపతి కొండమీద మూడునిద్రలు చేసి, ఒంగోలులో కోడలు పుట్టింట్లో రెండు రోజులుండి తిరిగి హైదరాబాద్ చేరుకున్నారు.

ఆనందనగర్ కాలనీలోని తమ ఇంటి తాళం తీసి లోపలికి అడుగు పెట్టగానే అందరికీ డిస్టెంబర్ వాసన వేసింది, ఇంటి గోడలనిండా నీలం రంగు డిస్టెంపర్ వేసి వుంది.

"ఇదేమిటి!" ఆశ్చర్యంగా అన్నది విశ్వేశ్వరరావు భార్య.

విశ్వేశ్వరరావు ఇల్లంతా తిరిగి చూశాడు ప్రతి గోడకీ రంగువేసి వుంది.

"ఎవరిపని అయి వుంటుంది ఇది?"

రెండవ కొడుకు తనలో తనే ఆలోచించుకుంటూ బయటికి గట్టిగా అన్నాడు.

"మన గోడలు మరకలతో అసహ్యంగా ఉండేవి. ఎవరో గాని మంచిపని చేశారు." చెప్పాడు పెద్దకొడుకు.

"కొంపదీసి ఏ దయ్యం పనో కాదుకదా ఇది?

క్షుద్రసాహిత్యముగా పిలవబడే అనేక నవలలను చదివిన కోడలు అన్నది.

ప్రయాణంలో అలసిపోవటంలో ఆరాత్రి ఇక ఆ విషయం ఆలోచించకుండా నిద్రపోయారు ఏదో అనుమానం వచ్చి మర్నాడు బీరువా తెరచి, అందులో నగలు ఉన్నాయోలేదో తనిఖీచేసింది విశ్వేశ్వరరావు భార్య.

అన్నీ పదిలంగా వున్నాయి.

కొన్ని వారాలపాటు ఇంటికి రంగువేసిన ఆ వ్యక్తి ఎవ్వరో మిస్టరీగా ఉండిపోయింది. తిరుపతి వెంకన్న పనే అని ఇంటిల్లిపాది—ఒక్క రెండవ కొడుకు తప్ప—నిర్ణయించారు.

ఒకరోజు పేపర్‌లో ఆ వార్త చదివాడు విశ్వేశ్వరరావు.

సూర్యప్రకాశరావు అనే ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్ విచిత్రమైన దొంగతనాలు చేసున్నాడని పోలీసులకు ఒకటి రెండుఫిర్యాదులు అందాయి. గత రాత్రి ఒక యింటి గోడలకు రంగులు వేసుండగా, రైలు దొరకని ఇంటివాళ్ళ తిరిగిరావటంతో అతను పట్టుబడ్డాడు.

యెంత ప్రయత్నించినా ఉద్యోగం రాకపోవడంతో సూర్యప్రకాశరావు ఇతర వూళ్ళకి వెళ్ళిన వాళ్ళ ఇళ్ళలోకి ప్రవేశించి వాళ్ళ గోడలకు డిస్టెంపర్ రంగు వేసాడు. రంగు ఖరీదు, తన రోజు కూలి ముప్పయి—రూపాయలు సరిపడమేరకు డబ్బో, విలువయిన వస్తువులో దొంగిలిస్తూంటాడు.

"ఇది దొంగతనంకాదు. నాకు ఎవరూ ఉద్యోగం ఇవ్వకపోవడంతో నేనే ఉద్యోగాన్ని బలవంతంగా సంపాదించుకుంటున్నాను" సూర్యప్రకాశరావు మా విలేఖరితో అన్నాడు. అతను దాదాపు ఏబై ఇళ్ళలో ఈ పని చేసినా ఎవరూ అతనిమీద ఫిర్యాదు చేయలేదని తెలుస్తున్నది"

"పోలీస్ స్టేషన్‌కి వెళ్ళి అతన్నోసారి చూసొద్దాం." చెప్పాడు రెండవకొడుకు.

అది ఆ యింటి సభ్యులందరి మనసులోని మాట. ఎలక్ట్రిక్ బ్రెడ్‌టోస్టర్, కేసెట్స్‌పోయినా వాటిగురించి కాదు-అతన్ని చూడాలనుకునేది.

## కలెక్షన్

సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో మధ్యాహ్నం రెండూ ఇరవై ఐదుకి వచ్చింది గుంటూరునుంచి వచ్చే గోల్కొండ ఎక్స్‌ప్రెస్-ఆరోజు కూడా లేటే.

అందులోంచి దిగిన ప్రయాణికులు చేతిలో సామానుతో ప్లాట్‌ఫారం నుంచి బయటకువెళ్ళే గేటువైపు నడవసాగారు. వారిలో ఏభై ఐదేళ్ళ వృద్ధుడుకూడా వున్నాడు. ఆయన పన్నెండేళ్ళ వయసున్న ఓ పాప చేతిని పట్టుకునినడిపిస్తున్నాడు. నల్లకళ్ళజోడు పెట్టుకొని వుంది ఆమె. ఆ పాప ఆయన చేతిని పట్టుకుని నడుస్తున్న తీరును చూస్తుంటే ఆమె గుడ్డిది అని తెలుస్తున్నది.

గేటుదగ్గర బాగా రద్దీగావుంది. ఆ పాప గేటుదగ్గరఉన్న అనేకమందిని ఢీకొట్టింది కళ్ళుకనపడక పోవటంతో. వాళ్ళు విసురుగా చూసారు ఆ పాపవంక. ఆమె గుడ్డిదని తెలియగానే పక్కకు జరిగి చోటు యివ్వసాగారు.

ఎంతో అందంగావున్న ఆ పాపకు కళ్ళు కనడకపోవడం వారిని బాధించింది. ఆమెవంక జాలిగా సానుభూతిగా చూశారు.

ఆయన రెండు టిక్కెట్లని టి. సి. చేతిలో వుంచి బయటకు నడిచాడు ఆమెతో.